క్లుప్తంగా

చదువుతోపాటు నైపుణ్యం పెంపొందించుకోవాలి

తెలకపల్లి: చదువుతోపాటు నైపుణ్యం పెంపొందించుకోవాలని సీఎల్‌ఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రాజమహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సీఎల్‌ఆర్ విద్యాసంస్థలోని ఆర్‌జీరెడ్డి జూనియర్ ఇంటర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్, ప్రకాష్‌రెడ్డి, సందీప్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ బోల్తా

బిజినేపల్లి: లారీ అదుపు తప్పి రోడ్డు పక్కల బోల్తా పడిన ఘటన శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తిమ్మాజిపేట మండలంలోని కోడుపర్తి మిట్ట సమీపంలో గ్రానైట్ బండలతో లారీ వెళ్తోంది. లారీ అదుపుతప్పి రోడ్డు పక్కకు వెళ్లి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

సీఎంబీ చర్చి నూతన కమిటీ ఎన్నిక



నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని సీఎంబీ చర్చిలో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పీఈ సంపత్ కుమార్, వైస్ చైర్మన్‌గా డీఎస్ సామ్యుల్, సెక్రెటరీగా పీఎస్ విజయ్‌కుమార్, జాయింట్ సెక్రెటరీగా ఎన్‌డీ దినకర్, ట్రెజరర్‌గా వీడబ్ల్యూ సైమన్, ఈసీ మెంబర్లుగా ఈడీ విశ్వప్రసాద్, కె.శాంసన్, బీఎస్ సంపత్‌కుమార్, కె.సునీల్‌రాజ్‌లు ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం

లింగాల: మండలంలోని అంబట్‌పల్లిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అచ్యుతారెడ్డి ఆధ్వర్యంలో శనివారం అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. కేఎల్‌ఐ కాల్వను తుర్కగుట్ట నుంచి ఎర్రమన్నుగుట్ట వరకు పొడించాలని వారు కోరారు. బ్యాంక్ లేక పోవడంతో లింగాల, పెద్దకార్పమూల బ్యాంక్‌లపై ఆధారపడాల్సి వస్తుందని తెలిపారు. జగదీశ్వర్, దేశమోని పర్వతాలు, నాగయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలి

మన్ననూర్: అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు పంబలి బుచ్చయ్య కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి శనివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 50 వేల అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందారని వివరించారు. కాంగ్రెస్ పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి మంత్రి పదవి ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.

అంగన్‌వాడీటీచర్‌కు ఘన సన్మానం

చారకొండ: మండల కేంద్రంలో 1వ అంగన్‌వాడీ సెంటర్ టీచర్ కళావతమ్మ పదవీవిరమణ పొందింది. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళావతమ్మ దంపతులను ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రషీదా, పద్మావతి, నిర్మల, సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

ఎస్టీయూ ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్‌రావు



అచ్చంపేట రూరల్: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శిగా అచ్చంపేటకు చెందిన శ్రీధర్‌రావును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి సమక్షంలో ఎన్నుకున్నారు. ఆయన ఎన్నిక పట్ల జిల్లా అధ్యక్షుడు మురళి, సుదర్శన్, సింగోటం, సతీష్, ఈశ్వర్, రమేష్, అర్జునయ్య తదితరులు హర్షం ప్రకటించారు.

ఫొటో ఎక్స్‌పోకు హాజరుకండి

కొల్లాపూర్: హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న ఫొటో ఎక్స్‌పోకు జిల్లాలోని ఫొటోగ్రాఫర్లు హాజరుకావాలని ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం జిల్లా నాయకుడు కట్టా శ్రీనివాసులు కోరారు. ఎక్స్‌పోలో కొత్త మోడల్ కెమెరాల పనితీరును తెలుసుకోవడంతో పాటు, ఫొటోగ్రఫీలో నూతన మెళకువలు తెలుసుకునేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో హాజరై నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని కోరారు.

ప్రాణాలు పోతున్నా పట్టింపేది?

- ప్రమాదకరంగా మూలమలుపులు
- పట్టించుకోని అధికారులు



ఉప్పునుంతల- జప్తీ సదగోడు రహదారిలో..



కట్లబండ వద్ద ప్రమాదకరంగా ఉన్న రోడ్డు మూలమలుపు

ఉప్పునుంతల: మండలంలో రోడ్లపై మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. వాహనదారులు కొంచెం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రాణాలు గాల్లో కలవాల్సిందే. రోడ్లకు ఇరువైపులా కంప చెట్లు ఏపుగా పెరగటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం సూచిక బోర్డు కూడా ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రాణాలు పోతున్నా అధికారులు ఏం చేస్తున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై బీటీ రోడ్లు దెబ్బతిన్న చోట ప్యాచ్‌లు వేయడం, రోడ్డుకు ఇరువైపుల చెట్లను నామమాత్రంగా తొలగించి రోడ్డు పక్కన మట్టిని వేసి బిల్లులను కాజేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రెండేళ్లలో ముగ్గురు బలి

ఉప్పునుంతల - అచ్చంపేట మార్గ మధ్యలో కట్లబండ స్టేజీ వద్ద ప్రమాదంగా ఉన్న మూల మలుపు వద్ద గడచిన రెండేళ్ల వ్యవధిలోనే ముగ్గురు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఒక ఉపాధ్యాయుని తోపాటు ఇద్దరు యువకులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఉప్పునుంతల వైపు నుంచి వేగంగా వెళ్లే వాహనాలు అదుపు తప్పి పక్కనే ఉన్న వ్యవసాయ పొలంలోకి పడిపోతున్నాయి. రోడ్డు పక్కన గోతి మాదిరిగా ఉండటంతో బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే చనిపోతున్నారు. అదేవిధంగా ఉప్పునుంతల నుంచి జప్తీ సదగోడు వెళ్లే మార్గంలో ఉస్మాన్ పౌల్ట్రీఫాం సమీపంలోని మూల మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు ఏమాత్రం కన్పించడంలేదు. ఒకే ప్రాంతంలో రెండు మూలమలుపులు ఉండటం ప్రమాదానికి మరింత కారణమవుతోంది.

ప్రమాదాలకు అడ్డాగా..

నాలుగు రోజుల కిందట ఉప్పునుంతల నుంచి జప్తీ సదగోడు వెళ్లే మార్గం ప్రమాదకరంగా ఉంది. ఎదురుగా బోరుబండి కన్పించకపోవడంతో బోరు బండి బైక్‌ను ఢీకొని ఉప్పునుంతలకు చెందిన మందుల శ్రీకాంత్ అనే యువకుడు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గతేడాది ఇదే మూలమలుపు వద్ద ఎదురెదురు వాహనాలు ఢీకొని జప్తీ సదగోడుకు చెందిన యువకుడు అక్కడికక్కడే చనిపోయాడు. జప్తీ సదగోడు సమీపంలో, మొల్గర పెద్దాపూర్ మార్గ మధ్యలో, మామిళ్లపల్లి సమీపంలో ఉన్న మూల మలుపులు ప్రమాదంగా ఉన్నాయి. తాడూరు సమీపంలోనే కొరటికల్ వైపు వెళ్లే మార్గంగా ఉన్న రోడ్డు మలుపు వద్ద ఎదురుగా వచ్చే వహనాలు ఏమాత్రం కన్పించడలేదు. కొరటికల్ నుంచి వెల్టూరు వెళ్లే రోడ్డు మార్గంలో రోడ్డు మలుపు ప్రమాదభరితంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మూల మలుపు వద్ద తగు ప్రమాద నియంత్రణ చర్యలు తీసుకోవడంతో పాటు రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించే విధంగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

చెట్లను తొలగించాలి



రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాలి. చెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పిండం లేదు. ఉప్పునుంతల నుంచి అచ్చంపేట వెళ్లే మార్గంలో కట్లబండ వద్ద ఉన్న రోడ్డు మూలమలుపు ప్రమాదకరంగా ఉంది. అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– నూకం చంద్రశేఖర్, వాహనదారుడు, మర్రిపల్లి

సూచిక బోర్డుల ఏర్పాటు చేస్తాం

ప్రమాదభరితంగా ఉన్న రోడ్డు మలుపులను పరిశీలిస్తాం. ప్రమాదాల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. రోడ్లకు ఇరువైపుల చెట్లను తొలగిస్తాం. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– లక్ష్మీపతి, ఆర్‌అండ్‌బీ ఏఈ, ఉప్పునుంతల

'శాట్' చైర్మన్‌కు సన్మానం



అచ్చంపేట: శాట్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శివసేనారెడ్డిని పట్టణ యూత్ కాంగ్రెస్ నాయకులు శనివారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చత్రునాయక్, కుంద మల్లికార్జున్, దశరథం, పవన్, జబ్బు వెంకట్, కృష్ణ నాయక్, శివ, శేఖర్ తదిరతులు పాల్గొన్నారు.

నల్లమల క్రీడాకారులను ప్రోత్సహించండి

దోమలపెంట: నల్లమలలో నైపుణ్యమున్న క్రీడాకారులు ఉన్నారని వారిని గుర్తించి ప్రోత్సహించాలని శాట్ చైర్మన్ శివసేనరెడ్డిని యువజన కాంగ్రెస్ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ ఛత్రునాయక్ కోరారు. శనివారం హైదరాబాద్‌లో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. నల్లమలలో విలువిద్యలో ప్రతిభగల క్రీడాకారులు ఉన్నారని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

తెలకపల్లి: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని పెద్దూరులో శనివారం చోటుచేసకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బీరం బాల్‌రెడ్డికి సంబంధించిన కాడి ఎద్దు గడ్డి మేస్తూ వేలాడుతున్న విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతిచెందిన ఎద్దు విలువ రూ.80 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

చెంచు, గిరిజనుల సమస్యలపై సర్వే



సర్వే చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని మారేడుమాందిన్నె, తీర్నాంపల్లి, చెంచు కాలనీలలో తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో శనివారం గిరిజనుల సమస్యలపై ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ సర్వే నిర్వహించారు. ఇళ్లు, రేషన్‌కార్డులు, తాగునీరు, సమస్య అధికంగా ఉందని వివరించారు. విషపు జ్వరాలు ప్రబలుతున్న ప్రభుత్వ డాక్టర్లు, ఏఎన్‌ఎంలు రావడం లేదని తెలిపారు. మారేడుమాందిన్నె, చెంచు కాలనీలలో వీధిలైట్లు అమర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలను నమోదు చేసుకొని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అశోక్ చెంచులకు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అశోక్, దశరథం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన వీడ్కోలు



వీడ్కోలు పలుకుతున్న ఉపాధ్యాయులు

దోమలపెంట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎస్‌కే స్టెల్లా, ఎం.ఈశ్వరయ్య, ఎల్. శ్రీధర్, ఎ.మల్లయ్య, బి.శిరీషలు బదిలీ అయ్యారు. ఈమేరకు శనివారం పాఠశాల ప్రాంగణంలో హెచ్‌ఎం.నాగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు వీడ్కోలు పలికారు. అదేవిధంగా నూతనంగా పాఠశాలలో బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు కె.నీలమ్మ, డి.మల్లికాంబ, పి.విజయ్‌లను సన్మానించారు. ఉపాధ్యాయులు ఎస్.శంకర్, కె.శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొలువుదీరిన పీర్లు



చారకొండ: మండలంలోని జూపల్లిలో శనివారం మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీర్ల చావిడిలో పీర్లను ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. 14న చిన్న సరిగేత్తు, 16న పెద్ద సరిగెత్తుగా ఉత్సవాలు నిర్వహిస్తునట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

'లొద్ది మల్లయ్యకు దర్శనానికి అనుమతివ్వాలి'

అచ్చంపేట: నల్లమల కొండల్లో వెలిసిన లొద్దిమల్లయ్యను దర్శించుకునే అవకాశం కల్పించాలని భజరంగ్‌దళ్ అచ్చంపేట డివిజన్ సభ్యులు శనివారం అచ్చంపేట ఎఫ్‌ఆర్‌ఓ సుశాంత్ బొబ్డేకు వినతి పత్రం అందజేశారు. ఈ నెల17న బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా అటవీమార్గంలో భక్తులు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా అటవీశాఖ నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శివచంద్ర, శివాజీ నరేష్, చందులాల్ చౌహాన్, అమర్, రాము, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ మండల కార్యదర్శిగా చంటి

కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్‌ఎస్‌యూఐ కల్వకుర్తి మండల కార్యదర్శిగా తాండ్రాకు చెందిన చంటిని నియమించారు. ఈ మేరకు శనివారం ఎన్‌ఎస్‌యుఐ నియోజకవర్గ అధ్యక్షుడు పరశురాం నియామకపత్రం అందజేశారు. బాధ్యతలు అప్పగించిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు సంతోష్‌నాయక్‌కు చంటి కృతజ్ఞతలు చెప్పారు.

పండ్ల మొక్కలు పంపిణీ



కోడేరు: మండలంలోని నర్సాయిపల్లిలో ఇంటింటికి పండ్ల మొక్కలను పంపిణీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్ తెలిపారు. జామ, ఖర్జూర, మునగ తదితర వాటిని గ్రామస్తులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాళీ స్థలంలో పండ్ల మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రయ్య, కురుమూర్తి, అన్వర్, కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



వెల్దండ: మండలంలోని చెర్కూర్ గ్రామానికి చెందిన గౌడుగు చంద్రయ్య ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ భీమయ్యగౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్, నాయకులు మైసయ్య, శ్రీను, భీమరాజు, లాలయ్య, సుభాష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



నాగర్ కర్నూల్: వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్, కలాం ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం పేద విద్యార్థులకు పట్టణంలోని నిర్మలాదేవి కాలనీలో ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జీవీ రామకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రాంతంలో 200 విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. కలాం ఫౌండేషన్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు బుచ్చన్న సహకారంతో అందజేస్తున్నామని పేర్కొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: చౌకధర దుకాణాలలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో చౌకధర దుకాణాల ద్వారా 9 రకాలైన నిత్యావసర వస్తువులను పంపిణీ చేసి పేదలను ఆదుకున్నారని తెలిపారు. ఉప్పు, చింతపండు, కారంపొడి, మంచినూనె, కందిపప్పు, గోధుమలు, చక్కెరలు లాంటి 9 రకాల వస్తువులను పంపిణీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

19 నుంచి ఉచిత కంటి వైద్య శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాఘువేందర్‌రెడ్డి

వెల్దండ: మండల కేంద్రంలో ఏవీఆర్ గార్డెన్‌లో ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తునట్లు ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఐక్యతా ఫౌండేషన్ కార్యాలయంలో కంటి వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేదలకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటిఅద్దాలు, ఆపరేషన్ చేయిస్తామన్నారు. దాదాపుగా 3వేల మందికి పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఐక్యతాఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి, నాయకులు అనిల్‌గౌడ్, సైదులు, శేఖర్, బాలరాజు, అంజి, పంతునాయక్, లక్ష్మణ్, నరేందర్‌గౌడు, వెంకట్‌రెడ్డి, వెంకట్‌నాయక్, యాదగిరి, మల్లయ్య, కొండల్, రమేష్‌నాయక్, మహేష్, రాహుల్ తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని సత్యసాయి సన్నిధి ఆవరణలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహిస్తునట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని విభాగాలు వైద్యులు అందుబాటులో ఉంటారని పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: ఎంపీ



ఎంపీ మల్లురవిని సన్మానిస్తున్న నాయకులు

వెల్దండ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవిని నాయకులు ఘనంగా సన్మానించారు. నాగర్‌కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఎంపీ మార్గమధ్యలో మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో అర్హులందరికి అందే విధంగా చూడాలని కోరారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పారీ అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, నాయకులు రషీద్, పుల్లయ్య, శేఖర్, రాహుల్, శ్రీనివాస్‌యాదవ్, పోలె రాజు, రమేష్‌గౌడు, శివరాజ్‌గౌడు, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాందాస్‌నాయక్

లింగాల: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, వైరా ఎమ్మెల్యే మలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. మండల కేంద్రానికి ఉపాధ్యాయుడు కాట్రావత్ రాజునాయక్ పదవీ విరమణ సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సన్మాన సభ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. శేష జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేయాలని కోరారు. అనంతరం రాజునాయక్ దంపతులను ఎమ్మెల్యేలు సన్మానించారు. మాజీ ఎంపీపీ లింగమ్మ, మాజీ జెడ్పీటీసీ నేజమ్మ, జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్, ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసులు, గిరిజన ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శంకర్‌రాథోడ్, పీపీఓ జనార్దన్, సంఘం నాయకులు ఉపాధ్యాయులు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాలలో నిరుపయోగంగా మరుగుదొడ్లు



బీసీ హాస్టల్‌లో మరుగుదొడ్లు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులు మరుగుదొడ్లను వినియోగించుకోకపోవడంతో అవి అలంకారప్రాయంగా మిగిలాయి. దీంతో మరుగుదొడ్ల చుట్టూ కంప చెట్లు ఏపుగా పెరిగాయి. లోపలికి వెళ్లేందుకు కూడా వీలులేకుండా కంపచెట్లు అల్లుకున్నాయి. విద్యార్థులు ఆరుబయటకు బహిర్భూమికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి మరుగుదొడ్లను వినియోగంలోకి తెచ్చేవిదంగా చర్యలు చేపట్టాలని హాస్టల్ విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కూలి అందక ఉపాధి కూలీల ఇబ్బందులు

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లిలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు కూలి డబ్బులు రెగ్యూలర్‌గా అందక ఇబ్బందులు పడుతున్నట్లు కూలీలు శనివారం పేర్కొన్నారు. వారం వారం అందాల్సిన డబ్బులు రెండు నెలలుగా అందకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని కూలీలు వాపోతున్నారు. ప్రతి నిత్యం 300 మంది కూలీలు పనులు చేస్తున్నామని, వారానికోసారి కూలి డబ్బులు చెల్లిస్తామని ఒక పక్క అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదని, కూలి డబ్బులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డబ్బులు రెగ్యూలర్‌గా అందేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఏపీఓ కుర్మయ్యను వివరణ కోసం ప్రయత్నించగా ఫోన్ లిప్టు చేయలేదు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ నాగార్జున

ఊర్కొండ: సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ నాగార్జున కోరారు. శనివారం మండలంలోని ఊర్కొండ పేటలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదట ఏర్పాటు చేసిన సమావేశానికి సీఐతోపాటు, ఎస్ఐ వీరబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల ప్రయోజనాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదం చేస్తాయని వివరించారు. దాతలు ముందుకు రావాలని కోరారు. సైబర్ క్రైం, నేరాలు, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువకులు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు వహిదొద్దీన్, మనోహర్ రెడ్డి, నర్సింహా, సజీద్, మధుసూదన్ రెడ్డి, అంజయ్యగౌడ్, శ్రీనివాసులు, సైబాజ్, అరవింద్, మల్లేష్, కై సార్, మాసుమ్ గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు